అటకెక్కిన కంపోస్ట్!

- నిర్వహణ లోపం
- షెడ్లు లేకపోవడంతో తడిచిపోతున్న చెత్త
- ఆగిపోయిన వర్మీ కంపోస్ట్ తయారీ


గోపాలపట్నం రైతుబజారు ముఖద్వారం


గోపాలపట్నం రైతు బజారులో నిరుపయోగంగా ఉన్న వర్మీ కంపోస్టు పిట్లు

గోపాలపట్నం: గోపాలపట్నం రైతు బజారులో వర్మీ కంపోస్టు ప్రాజెక్టు అటకెక్కింది. నిర్వహణ లోపంతో ఎరువు తయారీ నిలిచిపోయింది. కంపోస్టు ఎరువు కావాలని పలువురు అడుగుతున్నా నిర్వహణ చేసేందుకు అధికారులు మొగ్గు చూపడం లేదు.

ఇదీ పరిస్థితి

సేంద్రియ సాగు, ఇంటి పంటపై అవగాహన పెరిగిన తర్వాత చాలా ఇళ్లలో పండ్లు, పూల మొక్కలు పెంచుతున్నారు. వాటి సంరక్షణకు వర్మీ కంపోస్టు వినియోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో చాలా మంది రైతు బజారుకు వచ్చి కంపోస్టు ఎరువు కావాలని కోరినా ఇక్కడ లభ్యం లేదని చెప్పడంతో నిరాశతో వెనుతిరుగుతున్నారు. అలాగే చీడ పీడలు రాకుండా ఉండేందుకు నీమ్ ఆయిల్ వంటి పలు రకాల నేచురల్ మందులు కావాలని అడుతున్నారు. అయితే ఇవి ఇక్కడ లభ్యం కావడం లేదు. గోపాలపట్నం రైతు బజారులో వర్మీ కంపోస్టు ఉత్పత్తి కోసం 4 పిట్లు నిర్మాణం చేశారు. ఆరేళ్ల కిందట వాటిని నిర్వహణ చేసి ప్యాకెట్లలో కంపోస్టును రైతు బజారులో విక్రయించేవారు.

షెడ్లు లేక ఇబ్బందులు

కంపోస్టు పిట్లపై షెడ్లు వేయకపోవడం వల్ల వర్షాలకు చెత్త తడిచి సకాలంలో కంపోస్టు రాకపోవడంతో ఇబ్బందులు ఏర్పడ్డాయి. నిర్వహణపై శ్రద్ధ చూపకపోవడంతో పిట్లలో చెత్త పేరుకుపోతోంది. దీంతో దుర్వాసన వెదజల్లుతోంది. అయితే ఇటీవల అరకు నుంచి వచ్చిన రైతు ఈ పిట్లలో చెత్త, ఎరువు తీసుకు వెళ్లడంతో కొంత పరిస్థితి మెరుగుపడింది. లేక పోతే తరుచూ ఇబ్బందులు పడే వారమని వినియోగదారులు, స్థానికులు వాపోతున్నారు.

సరిగ్గా నిర్వహిస్తే ఉపయోగం

వ్యాపారస్తులు, రైతులు దీన్ని సరిగ్గా నిర్వహిస్తే మంచి లాభాలు వస్తాయని నిపుణులు చెబుతున్నారు. వర్మీ వేస్తే 45 రోజుల్లో అమ్మకానికి అందుబాటులోకి వచ్చేస్తుంది. వర్మీ లేకుండా అయితే మరో పదిరోజులు అదనంగా పడుతుంది. కంపోస్టుకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉందని దీంతో పాటు ఆర్గానిక్ పురుగు మందులు కూడా అందుబాటులో పెడితే బాగుటుందని చెబుతున్నారు.

రేకుల షెడ్లు వేయిస్తాం

వర్మీ కంపోస్టు పిట్లపై షెడ్లు వేయించేందుకు కృషి చేస్తున్నాను. దీనిపై ఇప్పటికే అధికారులకు లేఖ రాశాను. రైతు బజారులో అభివృద్ధి పనులు చురుగ్గా జరగుతున్నాయి. వర్మీ కంపోస్టును కూడా తయారు చేసి వినియోగదారులకు అందించే విధంగా కృషి చేస్తాను.

–నారాయణ రావు, ఈవో, గోపాలపట్నం రైతు బజారు

వీళ్లు మారరంతే..

- అధికారులు ఎంత మొత్తుకుంటున్నా వినని వాహన చోదకులు
- హెల్మెట్ లేకుండానే దర్జాగా ప్రయాణాలు
- తాము నిబంధనలకు అతీతమన్నట్లు నిర్లక్ష్యం


హెల్మెట్లు లేకుండా ప్రయాణిస్తున్న యువత


రోడ్డు మధ్య ద్విచక్ర వాహనం ఆపిన హెల్మెట్ ధరించని వ్యక్తి


హెల్మెట్ లేకుండా ప్రయాణం

మల్కాపురం: వాహనాల తనిఖీల్లో భాగంగా హెల్మెట్లు ధరించని వాహన చోదకులకు ట్రాఫిక్ పోలీసులు నిత్యం హితబోధ చేస్తున్నారు. 'బాబూ మా కోసం కాదు.. మీ కోసం.. మీ పిల్లల కోసమైనా హెల్మెట్ ధరించండి. సురక్షితంగా ప్రయాణం చేసి గమ్యాలకు చేరుకోండి' అంటూ చెబుతున్నారు. ఈ నెల ఒకటో తేదీ మొదలు ప్రతి ఒక్క వాహన చోదకుడు, వెనుక కూర్చున వ్యక్తి తప్పక హెల్మెట్ ధరించాలని అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దీనిలో భాగంగా మల్కాపురం స్టేషన్ పరిధి ట్రాఫిక్ ఎస్ఐ అప్పారావు తన సిబ్బందితో కలిసి స్టేషన్ పరిధి ప్రాంతాలైన డాక్‌యార్డ్, సింధియా, మల్కాపురం, నౌసేనాబాగ్, ఆర్‌కేపురం, శ్రీహరిపురం, కోరమాండల్ వంటి ప్రధాన కూడళ్లతో పాటు మిగిలిన ప్రాంతాల్లో కూడా హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్నారు. చదువుకున్న పిల్లలైతే మొదటి తప్పుగా వారిని హెచ్చరిస్తున్నారు. హెల్మెట్ వినియోగిస్తే కలిగే లాభాలు, వినియోగించకుంటే కలిగే నష్టాలపై విశదీకరిస్తున్నారు. అయినా స్టేషన్ పరిధి పలు ప్రాంతాల్లో సోమవారం కూడా హెల్మెట్ లేకుండా పలువురు దర్జాగా ప్రయాణాలు సాగించారు. ఏ నిబంధనలు తమకు వర్తించవు అన్నట్లు వారి మానాన వారు రయ్యిన సాగిపోయారు.

క్లుప్తంగా

వివాహిత అదృశ్యం

మల్కాపురం: భర్తతో గొడవ పడిన ఓ వివాహిత ఇంటి నుంచి వెళ్లిపోయింది.దీంతో భర్త మల్కాపురం పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. జీవీఎంసీ 60వ వార్డు ఇందిరాకాలనీ–1 ప్రాంతంలో డేవిడ్ రాజ్ అనే వ్యక్తి భార్య అరుణ, కుమారుడితో కలిసి నివాసం ఉంటున్నారు.అయితే కొద్దిరోజుల నుంచి భార్యాభర్తల మధ్య మనస్పర్థలు తలెత్తాయి. దీంతో వారు తరుచూ వాదించుకునే వారు. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం తగాదా పడ్డారు. దీంతో మనస్తాపం చెందిన ఆమె కుమారుడు, భర్తను విడిచి ఇంటి నుంచి ఆదివారం సాయంత్రం వెళ్లి పోయింది.చుట్టాలు, ఇరుగు పొరుగు వారిని వాకబు చేసినా ఆమె ఆచూకీ తెలియక పోవడంతో సోమవారం డేవిడ్ రాజ్ భార్య అదృశ్యం అయినట్టు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పోరాట యోధుడు సీతారాం ఏచూరి


సీతారాం ఏచూరికి నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు

మల్కాపురం: కమ్యూనిస్ట్ పార్టీ ద్వారా ఎన్నో ఉద్యమాలు నడిపి పేదల కన్నీరు తుడిచిన మహానుభావుడు సీతారాం ఏచూరి అని సీఐటీయూ మల్కాపురం జోన్ నాయకుడు ఆర్.లక్ష్మణమూర్తి కొనియాడారు. 59వ వార్డు గుల్లలపాలెం వార్డు శానిటరీ కార్యాలయం సమీపంలో సోమవారం సంతాప సభ నిర్వహించారు. తొలుత సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన చేసిన సేవలను వివరించారు.కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు,కార్యకర్తలు,పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

కొలనులో గణేశుడి నిమజ్జనం


నిమజ్జనంలో గణపతికి ప్రత్యేక పూజలు చేస్తున్న చిన్నారులు

కంచరపాలెం: గొల్లకంచరపాలెంలో రాధికా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక నవరాత్రి ఉత్సవాలు సోమవారంతో ఘనంగా ముగిశాయి. గణపతికి క్షీరాభిషేకం, ప్రత్యేక పూజలు చేసి చిన్నారులు తయారు చేసిన కొలనులో సాయంత్రం గణపతిని నిమజ్జనం చేశారు. అనంతరం ప్రసాద వితరణ చేశారు. పలు పోటీల్లో విజేతలకు బహుమతులు శ్రావణి అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు నమ్మి జశ్వంత్, మాన్విత, సీహెచ్ జశ్వంత్, ఎం.జశ్వంత్, జగదీష్, వెంకటీ, కె.నిఖిల, వై.దీక్షిత పాల్గొన్నారు.

ముగిసిన పవిత్రోత్సవాలు


కలువపూల అలంకరణలో కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్: గత 3 రోజులుగా కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు సోమవారంతో ముగిసాయి. ఈ సందర్భంగా ఉదయం 8 నుంచి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, పవిత్ర ఆవరోహణం, మహా పూర్ణాహుతి, ఆశీర్వచనం జరిపారు. దేవస్థాన వేదపండితులు, అర్చకుల పర్యవేక్షణలో పవిత్రోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి.శ్రీనివాసులరెడ్డి, ఏఈవోలు వెంపలి రాంబాబు, కె. తిరుమలేశ్వరరావు, వేద పండితులు, అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత


భక్తులకు వడ్డిస్తున్న ఎమ్మెల్యే గణబాబు, లక్ష్మణరావు

మల్కాపురం: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే గణబాబు అన్నారు. జీవీఎంసీ 59వ వార్డు నక్కవానిపాలెంలో సోమవారం వినాయక మండపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే గణబాబు తొలుత గణపతిని దర్శించుకుని అనంతరం నిర్వాహకులు ఏర్పాటు చేసిన భారీ అన్న సమారాధనను ప్రారంభించారు. పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నక్క లక్ష్మణరావుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

63వ వార్డులో..

సింధియా: జీవీఎంసీ 63వ వార్డు పరిధి జైఆంధ్రకాలనీ, మల్కాపురం పోలీస్‌స్టేషన్, యారాడ ఆటో స్టాండ్ వద్ద నిర్వహిస్తున్న గణపతి ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఏర్పాటు చేసిన అన్నసమారాధనలను వార్డు కార్పొరేట గల్లా చిన్నా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఎన్ని దానాలు చేసినా రాని సంతృప్తి కేవలం అన్నదానం చేసినప్పుడు మాత్రమే వస్తుందన్నారు. కార్యక్రమంలో 40వ వార్డు టీడీపీ ప్రెసిడెంట్ రమణ, 63వ వార్డు జనసేన అధ్యక్షుడు శివ, జెర్రిపోతుల నర్సింగరావు, గూడెల కృష్ణ, పుక్కల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ


గోపాలపట్నంలో ముస్లింలు చేపట్టిన ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం: మహ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా ముస్లింలు మంగళవారం మిలాద్– ఉన్– నబీ పండగను గోపాపట్నంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇక్కడి మసీద్ నుంచి ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ మహ్మద్ ప్రవక్త ప్రభోదాలు అందరికీ ప్రేమను పంచాలని సూచించాయన్నారు. పేదలకు సాయం అందించాలన్నారు.

గంజాయితో యువకుడి అరెస్ట్

అల్లిపురం: గంజాయి కలిగి ఉన్న యువకుడిని టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ బి.తిరుమలరావు తెలిపిన వివరాలు. పెదబయలు ప్రాంతానికి చెందిన బాల గంగాధర్ తిలక్ (24) గంజాయి తీసుకొచ్చి పితానిదిబ్బలో విక్రయానికి ప్రయత్నిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో టాస్క్‌ఫోర్స్ సిబ్బందితో కలిసి టూటౌన్ ఎస్ఐ శంకరరావు దాడి చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 23 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ఎలాంటి పోరాటాలకైనా సిద్ధం


దీక్షా శిబిరంలో పాల్గొన్న కార్మికులు

అగనంపూడి: విశాఖ ఉక్కును పరిరక్షించుకోడానికి ఎలాంటి పోరాటాలకైనా సిద్ధంగా ఉన్నామని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో మంగళవారం చేపట్టిన 1313వ రోజు రిలే దీక్షా శిబిరంలో ఆయన మాట్లాడారు. దీర్ఘ కాలంగా ఆందోళనలు, ఉద్యమాలు, రాస్తారోకోలు చేస్తున్నా కేంద్ర ప్రభుత్వ పెద్దలు కనీసం చలించకపోవడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వంలో కదలిక తీసుకురావడానికి ఎలాంటి పోరాటాలకైనా, త్యాగాలకైనా సిద్ధమే అని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కమిటీ నాయకులు మసేన్‌రావు, డొక్కా నరసింగరావు, కె.రాజబాబు, సాంబశివరావు, జి.రాజు, డేవిడ్, సలాది శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వాహనాల టెస్ట్‌లు ప్రైవేటుపరం చేయొద్దు


మాట్లాడుతున్న పడాల గోవింద్

మద్దిలపాలెం: వాహనాల ఫిట్‌నెస్‌తోపాటు డ్రైవింగ్ లైసెన్స్ టెస్ట్‌లను ప్రైవేటు సంస్థలకు అప్పగించవద్దని ఏఐటీయూసీ ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పడాల గోవింద్ విజ్ఞప్తి చేశారు. మద్దిలపాలెంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో సోమవారం ఆటో డ్రైవర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మోటార్ సవరణ చట్టం న్యాయ సంహిత బిల్లులో వాహనాల రిజిస్ట్రేషన్లు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, డ్రైవింగ్ లైసెన్స్ టెస్టింగ్ చేసే ట్రాక్‌లను ప్రైవేట్ సంస్థలకు అప్పగించి, ఆటోమేటిక్ సెన్సార్ టెస్టింగ్ ట్రాక్ ద్వారా జారీ చేసే విధానాన్ని తక్షణమే రద్దు చేయాలన్నారు. దీని వల్ల రోజూ ఆటో నడిపితే గాని పూట గడవని డ్రైవర్లు, వారి కుటుంబాలు అనేక ఇబ్బందులు పడే అవకాశముందన్నారు. గతంలో మాదిరిగానే ఆర్టీవో కార్యాలయం ద్వారా రిజిస్ట్రేషన్లు, సర్టిఫికెట్లు, లైసెన్సులు జారీ చేసే విధానాన్ని కొనసాగించాలని కోరారు. ఈ ప్రతిపాదన రద్దయ్యే వరకు డ్రైవర్లు ఉద్యమ పోరాటానికి సిద్ధమవ్వాలని పడాల గోవింద్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వాసు, లోవరాజు, శివ, శ్రీను, నాగు, నంద, గురునాథ్ తదితర డ్రైవర్లు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల పోరుబాట

రేపు ఈడీ బిల్డింగ్ వద్ద ధర్నా


ఐక్యత చాటుతున్న కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో పోరుబాట పట్టారు. అఖిలపక్ష కాంట్రాక్ట్ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ఎల్ఎంఎం పార్కులో సమావేశమైన నాయకులు ఉద్యమంపై చర్చించారు. కాంట్రాక్ట్ కార్మికుల అటెండెన్స్ గేట్లు వద్ద ఉన్న బయోమెట్రిక్ మిషన్ల ద్వారా కాకుండా విభాగాల్లో హాజరు ఇవ్వాలని, జీతాల కోత విధించే నిర్ణయం ఉపసంహరించాలని, బయోమెట్రిక్ పేరిట ఏ కార్మికుడిని నిలుపుదల చేసినా అంగీకరించబోమన్నారు. కాంట్రాక్ట్ కార్మికుల ఫైనల్ చెల్లింపులో కోత విధించరాదని, స్కిల్డ్ కార్మికులకు ఈఎస్ఐ బదులు ఇన్సూరెన్స్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం బుధవారం ఈడీ (వర్క్స్) బిల్డింగ్ వద్ద ధర్నా చేయనున్నామని తెలిపారు. కార్యక్రమంలో మంత్రి రవి, పిట్టారెడ్డి, పి. భాస్కరరావు, ఉరుకూటి అప్పారావు, ధర్మాల రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోర్టు ఆస్పత్రిని ప్రైవేట్‌కు కట్టబెట్టొద్దు

- సిటు నేతల డిమాండ్
- 19న నల్లబ్యాడ్జీలతో నిరసన
- 24న ఏవోబీ వద్ద ఒక రోజు ధర్నా
- అక్టోబర్ 1 నుంచి రిలే నిరాహార దీక్షలు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న పోర్టు అండ్ డాక్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు

దాబాగార్డెన్స్: పోర్టు గోల్డెన్ జూబ్లీ ఆస్పత్రిని ప్రైవేట్‌కు కట్టబెట్టొద్దని, పోర్టు సొంత నిధులతోనే అభివృద్ధి చేయాలని సిటు డిమాండ్ చేసింది. విశాఖ పోర్టు ఆస్పత్రిని పీపీపీకి ఇవ్వాలనే నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం నగరంలోని జగదాంబ జంక్షన్ సమీపాన గల సిటు కార్యాలయంలో యునైటెడ్ పోర్టు అండ్ డాక్ ఎంప్లాయిస్ యూనియన్ నిరసనకు సంబంధించిన పోస్టర్‌ను యూనియన్ ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ కార్యదర్శి బి.జగన్, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ పోర్టు గోల్డెన్ జూబ్లీ ఆస్పత్రిని సాలిగ్రామపురంలో 1984లో 150 పడకల సామర్థ్యంతో ఏర్పాటు చేశారన్నారు. ప్రస్తుతం 80 పడకలతో సమర్థవంతంగా నడుస్తోందన్నారు. పోర్టు అండ్ డాక్ అధికారులు, ఉద్యోగులు, కార్మికులు, రిటైర్ అయిన కార్మికులు, ఫ్యామిలీ పెన్షనర్లు, పూల్ కలాశీలు, సీహెచ్‌డీ క్యాజువల్ కార్మికులతో పాటు సీఐఎస్ఎఫ్ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు 35 వేల కుటుంబాలకు దశాబ్దాల తరబడి సేవలందిస్తుందన్నారు. అటువంటి పోర్టు ఆస్పత్రిని పీపీపీ పద్ధతిలో మల్టీ డిసిప్లినరీ సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రిగా 300 పడకలతో ప్రైవేట్ వారికి ఇచ్చేయాలనే నిర్ణయం దుర్మార్గమన్నారు. ఈ నిర్ణయాన్ని సిటు వ్యతిరేకిస్తుందన్నారు. పోర్టులో పీపీపీ/ఓబీటీ విధానాలు విఫలమయ్యాయని, గతంలో స్వయంగా కాగ్ మొట్టికాయలు వేసిన సంగతిని గుర్తు చేశారు. పీపీపీ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సంతకాల సేకరణ చేపడుతున్నామని, దీనిలో భాగంగా 19న నల్లబ్యాడ్జీలతో నిరసన, 24న ఏవోబీ వద్ద ఒక రోజు ధర్నా, అక్టోబర్ 1 నుంచి పోర్టు ఆస్పత్రి వద్ద రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వి.రామలింగేశ్వరరావు, జక్కన్న సత్యనారాయణ పాల్గొన్నారు.

గణపతి పందిళ్ల వద్ద అన్నసమారాధనలు


శాంతినగర్‌లో భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్


కొత్తపాలెంలో భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు గోపాలకృష్ణ, పైడిరాజు


జనతా కాలనీలో భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న సత్తిబాబు


యల్లపువానిపాలెంలో భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న దొడ్డి కిరణ్


అన్నప్రసాదాలు వడ్డిస్తున్న నాయకులు

గోపాలపట్నం : వినాయక నవరాత్రుల సందర్భంగా పలు వీధుల్లో భారీ అన్నదానాలు నిర్వహించారు. ఉదయం నుంచి మండపాల్లో ప్రత్యేక పూజలు చేశారు. విఘ్న నాయకునికి అన్నప్రసాదాలు నైవేద్యంగా సమర్పించారు. పలువురు నాయకులు పాల్గొని భక్తులకు అన్నప్రసాదాలు వడ్డించారు.

శాంతినగర్‌లో..

శాంతినగర్‌లో వినాయక నవరాత్రుల సందర్భంగా యూత్ ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అప్పప్రసాదాలు వడ్డించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు జియ్యాని మారుతి, యువజన నాయకుడు జియ్యాని విజయ్, యువకులు పాల్గొన్నారు.

కొత్తపాలెంలో..

కొత్తపాలెంలో వినాయక నరాత్రుల సందర్భంగా పలు మండపాల వద్ద నిర్వహించిన అన్నసమారాధనలలో 89వ వార్డు వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు అయితంశెట్టి రేణుకా గోపాలకృష్ణ, కొత్తపాలెం మాజీ పీఏసీఎస్ చైర్మన్ ఆళ్ల పైడిరాజు భక్తులకు అన్నప్రసాదాలు వడ్డించారు.

- జీవీఎంసీ 92వ వార్డు జనతా కాలనీలోని రసూల్ కేటరింగ్ ఆధ్వర్యంలో అన్నమారాధన నిర్వహించారు. స్థానిక నాయకుడు కొండాపు సత్తిబాబు పాల్గొని భక్తులకు అన్నప్రసాదాలు వడ్డించారు. ఈ కార్యక్రమంలో అమీన్ అప్పలరెడ్డి, బాషా, అధిక సంఖ్యలో కాలనీ వాసులు పాల్గొన్నారు.
- యల్లపువానిపాలెంలోని సింహాద్రి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన అన్నసమారాధనలో వైఎస్సార్‌సీపీ నాయకుడు, డీకే ఫౌండేషన్ వ్యవస్థాపకుడు దొడ్డి కిరణ్ పాల్గొని భక్తులకు అన్నప్రసాదాలు వడ్డించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, స్థానికులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

62వ వార్డులో ..

సింధియా: జీవీఎంసీ 62వ వార్డులో పలుచోట్ల ఏర్పాటు చేసిన గణపతి మండపాల వద్ద గణపతి నవరాత్రి మహోత్సాలు సందర్భంగా భారీ అన్నసమారాధన నిర్వహించారు. జీవీఎంసీ 62వ వార్డు దుర్గానగర్‌లో స్టార్ దుర్గా యూత్ ఆధ్వర్యంలో, గుడివాడ అప్పన్నకాలనీ యంగ్ యూత్ ఆధ్వర్యంలో, ప్రకాష్‌నగర్‌లోని యూత్ సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన అన్నసమారాధనను మౌర్యసింహ ప్రారంభించారు. కార్యక్రమంలో 62వ వార్డు టీడీపీ అధ్యక్షుడు మజ్జి మాలినాయు డు, నీలాపు జోగిబాబు, గంగాధర్, జగదీష్, మంగి రామారావు,ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నర్సుల నిరసన ప్రదర్శన


కేజీహెచ్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్ట్ నర్సులు

మహారాణిపేట: జీవో 115ను రద్దు చేయాలని కోరుతూ కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు చేస్తున్న ఆందోళన 11వ రోజుకు చేరుకుంది. కేజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట వారు సోమవారం కూడా నిరసన ప్రదర్శన చేపట్టారు. ఏపీ నర్సుల స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో గత పది రోజుల నుంచి వారు ఆందోళన చేస్తున్నారు. కాంట్రాక్టు నర్సులు జీఎన్ఎం, బీఎస్ నర్సింగ్, ఎంఎస్సీ నర్సింగ్ చదవి ఇప్పటికే ఎన్నో సంవత్సరాల అనుభవం ఉన్నవారు ఉన్నారని, తమను రెగ్యులర్ చేయకుండా ఇతరులకు పదోన్నతులు కల్పించవద్దని నర్సులు డిమాండ్ చేశారు.

గీతా ప్రచార సమితి గౌరవ అధ్యక్షుడు కృష్ణమూర్తి మృతి

దాబాగార్డెన్స్: గీతా ప్రచార సమితి గౌరవ అధ్యక్షుడు, భగవద్గీత ప్రచారకుడు యెండూరి కృష్ణమూర్తి (94) సోమవారం కన్నుమూశారు. నగరంలోని రామ్‌నగర్ రోడ్డులోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. పాతనగరం ఏరియాలో భగవద్గీత కోసం ఏర్పాటు చేసిన శ్రీగీతా ప్రచార సమితి ద్వారా గత 50 ఏళ్లకు పైగా ఆధ్యాత్మిక సేవలందించారు. చి కాన్వెంట్ జంక్షన్‌లో గల హిందూ శ్మశాన వాటికలో సాంప్రదాయ రీతిన అంత్యక్రియలు జరిపారు. ఆయన అకాల మృతికి శ్రీగీతా ప్రచార సమితి అధ్యక్షుడు సీహెచ్ విశ్వేశ్వరరావు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, సమితి ఉపాధ్యక్షుడు పి. జగన్‌మోహన్‌రావు, కార్యదర్శి ఎం. వనజాదేవి, కోశాధికారి జీవీఆర్ ప్రసాద్ సంతాపం వ్యక్తం చేసి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.